క్లుప్తంగా

అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన సీఐ రామకృష్ణ

దుండిగల్: ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేస్తున్నామని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ కాలనీలు, ప్రాంతాలకు చెందిన ప్రజలు శుక్రవారం ఆయనను కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరడంతో వెంటనే అధికారులతో మాట్లాడారు. అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అదే విధంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన దుండిగల్ సీఐ రామకృష్ణ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తాం

దుండిగల్: వార్డులో నెలకొన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామని కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ తెలిపారు. శంభీపూర్‌లోని 26వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. నూతనంగా నిర్మించనున్న మహిళా భవనం, ప్రహరీ, మరుగు దొడ్ల స్థలాలను పరిశీలించారు. స్థల ఎంపిక పూర్తి కాగానే పనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్కల జీతయ్య, తిరుమలేశ్, వీరేశ్, మల్లేశ్, శ్రీశైలం, శ్రీశైలం, కుమార్ పాల్గొన్నారు.

నాలా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారం

జీడిమెట్ల: ఇళ్లల్లోని చెత్తాచెదారాలు నాలాలో వేయకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని వెంకటాద్రినగర్ కాలనీవాసులు అంటున్నారు. సుభాష్‌నగర్ డివిజన్‌లోని వెంకటాద్రినగర్‌లో నాలాకు ఆనుకుని ఉన్న ఇళ్లల్లోంచి ప్రజలు చెత్తను నేరుగా నాలాలోకి వేస్తున్నారు. దీంతో వర్షం కురిసినప్పుడు వరదనీరు నాలా నుంచి రోడ్ల పైకి వస్తోందని చెబుతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు పట్టించుకుని నాలా చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఓయూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ పూర్వవిద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్‌లో అభివృద్ధి చెందుతున్న ధోరణలు అనే అంశంపై 2వ అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. శుక్రవారం ఇంజినీరింగ్ కాలేజీ అసెంబ్లీ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి వీసీ ప్రొ.రవీందర్ అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.లింబాద్రి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభించి మాట్లాడారు. విద్యా సంస్థలు పరిశ్రమల నడుమ సంబంధాలు మెరుగుపడాలని, విద్యార్థుల పై విద్యపరమైన ఒత్తిడి తగ్గించాలని ప్రొ.లింబాద్రి పేర్కొన్నారు. ఇంజినీరింగ్ రంగంలో అత్యాధునిక సాంకేతిక అంశాల పై ఓయూ మాజీ వీసీ, అనురాగ్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొ.రాంచంద్రం చర్చించారు.

3 నుంచి నిరుద్యోగ భరోసా బస్సుయాత్ర

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ భరోసా బస్సుయాత్రను చేపట్టనున్నట్లు తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మిడతపల్లి విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ నివాసంలో బస్సు యాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి బస్సు యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. టీఎస్ జాక్, ఓయూ జేఏసీ, నిరుద్యోగ జేఏసీల ఆధ్వర్యంలో వచ్చే నెల 3న ఉదయం ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ నుంచి బస్సుయాత్రను ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, విశ్వవిద్యాలయాలలో యాత్రను కొనసాగించనున్నట్లు వివరించారు.ట

ఇళ్లు ఇచ్చే వరకు పోరాటం ఆగదు

బీజేపీ పిలుపు ఇవ్వడంతో డబల్ బెడ్‌రూమ్ దరఖాసుదారులు పెద్ద ఎత్తున డబుల్ ఇళ్ల సముదాయాల వద్దకు చేరుకుంటారనే సమాచారంతో శుక్రవారం ఉదయం నుంచి టెన్షన్ వాతావరణం నెలకొంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఆ పార్టీకి చెందిన నేతల నివాసాల వద్ద పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి గృహ నిర్బంధం చేశారు. అంతేకాకుండా దేవేందర్ నగర్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించడం అక్కడికి వస్తున్న నేతలను అరెస్టు చేయడం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

– కుత్బుల్లాపూర్/సుభాష్‌నగర్







నిరసన తెలుపుతున్న కుత్బుల్లాపూర్ బీజేపీ నాయకులు, కార్యకర్తలను తరలిస్తున్న పోలీసులు

- మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్
- నియోజకవర్గ వ్యాప్తంగా నిరసనలకు బీజేపీ పిలుపు
- కుత్బుల్లాపూర్‌లోని బీజేపీ నేతలను గృహనిర్బంధం చేసిన పోలీసులు

జగద్గిరిగుట్ట సీఐ క్రాంతి కుమార్, జీడిమెట్ల సీఐ పవన్, దుండిగల్ సీఐ రామకృష్ణ సిబ్బంది మొదట దేవేందర్‌నగర్ ప్రాంతంలో పెద్ద ఎత్తున మోహరించారు. నలువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి మాజీ ఎమ్మెల్యే బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ రాక కోసం ఎదురు చూశారు. అయితే శ్రీశైలంగౌడ్ సోదరుడు శ్రీనివాస్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, ఆకుల సతీష్, శేఖర్ యాదవ్, గడ్డం రాజేందర్‌రెడ్డి, బక్క శంకర్‌రెడ్డి తదితరులు బహదూర్‌పల్లి డబుల్ బెడ్‌రూమ్ సముదాయం వద్దకు వెళ్లి నిరసన దీక్షకు దిగారు. పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకుని జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులకు బీజేపీ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. ఎమ్మెల్యే వివేకానంద్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పోలీసులకు దొరక్కుండా బహదూర్‌పల్లికి కూన..

నిరసన ధర్నాకు పిలుపునిచ్చిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను అదుపులోకి తీసుకునేందుకు జీడిమెట్ల పోలీసులు తెల్లవారుజామున 5గంటలకే ఆయన నివాసానికి చేరుకునేసరికి అప్పటికే వెళ్లిపోయారు. దీంతో అప్రమత్తమైన మూడు పోలీస్‌స్టేషన్ల సీఐలు బహదూర్‌పల్లి, దుండిగల్, దేవేందర్ నగర్ ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ సముదాయాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బహదూర్‌పల్లికి చేరుకున్న కూన శ్రీశైలంగౌడ్ ఆందోళనకు దిగారు. అప్రమత్తమైన పోలీసులు ఆయనను అదుపులో తీసుకుని శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శ్రీశైలంగౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారన్న వార్త రావడంతో బీజేపీ కార్యకర్తలు పలు ప్రాంతాల్లో ఆందోళనకు దిగారు. అంతేకాకుండా జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల మధ్య బీజేపీ నేతల అరెస్టుల పర్వం కొనసాగింది.

పోరాటం ఆగదు..

9 ఏళ్లుగా అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ తప్పుడు వాగ్దానాలతో రెండుసార్లు గద్దెనెక్కి ప్రజలను మోసం చేశారని కూన శ్రీశైలంగౌడ్ విమర్శించారు. ఐదేళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు డబల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వారికే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇతరులకు ఇస్తే ఆందోళన తప్పదన్నారు.



బహదూర్‌పల్లి డబుల్‌బెడ్‌రూమ్ గృహాల వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న శ్రీశైలంగౌడ్, నేతలు

మెషిన్ లెర్నింగ్‌పై అధ్యాపకులకు శిక్షణ

దుండిగల్: అధ్యాపకుల బోధనా పద్ధతులు, వారి నైపుణ్యాలను పెంచే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎంఎల్ఆర్ ఐటీ కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దుండిగల్‌లోని కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మెషిన్ లెర్నింగ్‌పై ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. మెషిన్ లెర్నింగ్, డేటా అనలటిక్స్ సాధనాలను ఉపయోగించి సాంకేతికంగా నెలకొనే సమస్యలను పరిష్కరించవచ్చన్నారు. ఐఐటీ, ఎన్ఐటీకి చెందిన అధ్యాపకులు బోధిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కోశాధికారి మర్రి మమతారెడ్డి, డైరెక్టర్ శ్రేయారెడ్డి, ప్రిన్సిపాల్ డా. శ్రీనివాస్‌రావు, సీఎస్ఈ హెచ్ఓడీ బలరాం, మెషిన్ లెర్నింగ్ హెచ్ఓడీ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

జన జాతరను విజయవంతం చేయాలి

నిజాంపేట్: దేశ పురోగాభివృద్ధికి శాస్త్ర సాంకేతికతలకే కారణమని, జ్యోతిష్య శాస్త్రం కాదని కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి బాలపీరు అన్నారు. ఈ నెల 29న నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే జ్యోతిరావ్‌పూలే, అంబేడ్కర్ జన జాతరను విజయవంతం చేయాలని శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. సమాజంలో రోజురోజుకు మూఢ నమ్మకాలు పెరిగిపోతున్నాయని అన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడమే జన జాతర ముఖ్యఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు భిక్షమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి నరసింహా, గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం

దుండిగల్: పేదింటి బిడ్డలకు ఆర్థిక భారం పడకూడదని సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని బౌరంపేట కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బౌరంపేట వార్డు 16వ వార్డుకు చెందిన మాధవికి మంజూరైన రూ.1.16 లక్షల కల్యాణ లక్ష్మి చెక్కును శుక్రవారం ఆమె తండ్రి శంకరయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. అదేవిధంగా 16వ వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించడం కోసం నూతన డ్రైనేజీ పైపులైన్ వేశారు. దీని కారణంగా పక్కనే ఉన్న మంచి నీటి పైపులు పగిలిపోయాయి. విషయం తెలుసుకున్న శ్రీనివాస్‌రెడ్డి రూ.30 వేలు తన సొంత ఖర్చుతో నూతన పైపులను వేయించారు. కార్యక్రమంలో మన్నే శేఖర్, సురేశ్‌యాదవ్, మల్లారెడ్డి, తలారి సత్యనారాయణ, రామకృష్ణ, మల్లేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

సీసీరోడ్డు పనుల పరిశీలన

జగద్గిరిగుట్ట: సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని కార్పొరేటర్ జగన్ అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లో ఇటీవలే ప్రారంభమైన సీసీరోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. వీలైనంత తొందరగా ఈ రోడ్డు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. జగద్గిరిగుట్ట డివిజన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, వాటర్ పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఇక ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు కూడా దాదాపు పూర్తి చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రెసిడెంట్ నర్సింగ్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలకు కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

కుత్బుల్లాపూర్: మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ రెండు మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌కు అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఉన్న నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా కొలను రాజశేఖర్ రెడ్డి, దుండిగల్ మున్సిపాలిటీకి మద్దికుంట నవీన్ రెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీకి బైరి ప్రశాంత్‌గౌడ్‌లను నియమించారు. పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తామని వారు పేర్కొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

కుత్బుల్లాపూర్: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠా నుంచి కూకట్‌పల్లి, మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు రూ.48లక్షలు విలువ చేసే నగదు, ల్యాప్‌టాప్‌లు, కమ్యూనికేషన్ బోర్డు, రికార్డర్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ శ్రీనివాస్‌రావు వివరాలు వెల్లడించారు.

- కూకట్‌పల్లి హెచ్ఎంటీ శాతవాహనగర్‌కు చెందిన ఫ్లెక్సీ దుకాణ యజమాని సురేంద్ర(27), లక్ష్మణ్ బాబు (24), ప్రైవేట్ ఉద్యోగి శేషాద్రి రవి బాబు(36), గుమ్మడిదల ఆంజనేయులు (44) కొంత కాలంగా క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన ఆర్ఆర్, సీఎస్‌కే జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్‌ల నేపథ్యంలో హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లోని కీర్తి మాన్షన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ జరుగుతోందని సమాచారం అందింది. ఈనెల 27న కూకట్‌పల్లి పోలీసులు, మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు దాడులు చేశారు.



పట్టుబడిన నగదు, వస్తు సామగ్రిని పరిశీలిస్తున్న డీసీపీ శ్రీనివాస్‌రావు

- నిందితుల నుంచి రూ.30,06,000 నగదు, 20 లైన్ల కమ్యూనికేషన్ బోర్డ్, 26 లైన్ల కమ్యూనికేషన్ బోర్డు, మూడు ల్యాప్‌టాప్‌లు, వైఫై రౌటర్, సోని రికార్డర్, కారు మొత్తం రూ.48 లక్షల విలువ చేసే సొత్తును రికవరీ చేసి వారిని రిమాండ్‌కు పంపారు. గుంటూరుకు చెందిన నలుగురు బూకీలు బాలాజీ, బాబీ, మున్నాలు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు.
- బెట్టింగ్ ముఠాను పట్టుకోవడంతో కీలకంగా వ్యవహరించిన మాదాపూర్ జోన్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్, ఎస్సై విజయవర్ధన్, సిబ్బంది నరసింహ, కృష్ణ కుమార్, సుదర్శన్, ప్రభాకర్, ఆంజనేయులును డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



జ్యూవెలరీ షాపు సిబ్బందికి అవగాహన కలిగిస్తూ..

జీడిమెట్ల: దుకాణా సముదాయాల్లో అగ్నిమాపక పరికరాలు విరివిగా వాడాలని జీడిమెట్ల ఫైర్ అధికారి సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సుచిత్ర సర్కిల్‌లోని మానేపల్లి జ్యూవెలర్స్ నగల దుకాణంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. జీడిమెట్ల ఫైర్ స్టేషన్ సిబ్బంది వివిధ అగ్నిమాపక పరికరాలను ఉంచి దుకాణ సిబ్బందికి అవగాహణ కల్పించారు. ఒకవేళ అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలను ఏ విధంగా అదుపు చేయాలో దుకాణ సిబ్బందికి వివరించారు. ఒకవేళ దుకాణంలో సిబ్బంది ఉంటే వారిని ఎలా బయటకు పంపించాలి. అనంతరం ఎలాంటి పరికరాలను వాడాలో మాక్‌డ్రిల్ చేసి చూపించారు.

ఆలయాభివృద్ధికి రూ.3లక్షల విరాళం

నిజాంపేట్: కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్‌లో ఉన్న శ్రీనల్లపోచమ్మ ఆలయ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వచ్చే 3 నుంచి 5వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వాకలపూడి రంగారాయప్రసాద్ తనవంతు సహాయంగా ఆలయాభివృద్ధికి రూ.3లక్షల విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయాభివృద్ధికి తన వంతు సహాయ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని రంగ రాయప్రసాద్ పేర్కొన్నారు.



ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగారాయప్రసాద్

రోడ్డుపై నిర్మాణ వ్యర్థాలు.. రాకపోకలకు ఇబ్బందులు



విజయనగర్ కాలనీ - భగత్‌సింగ్‌నగర్ చౌరస్తాలో నిర్మాణ వ్యర్థాలు

రంగారెడ్డినగర్: నిర్మాణ వ్యర్థాలను తొలగించకపోవడంతో రాకపోలకు ఆటంకంగా మారుతోంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని విజయ్‌నగర్ కాలనీ ప్రధాన రోడ్డు పనులను ఇటీవల పూర్తి చేశారు. అయితే సదరు కాంట్రాక్టర్ పనుల సమయంలో వెలువడిన మట్టి, రాళ్లను తొలగించకుండా భగత్ సింగ్‌నగర్, విజయనగర్‌కాలనీ చౌరస్తాలో వదిలి వేసి చేతులు దులుపుకున్నారు. ఈ విషయమై అధికారుల స్పందించి వ్యర్థాలను తొలగించి రాకపోకలు సాఫీగా సాగాలే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాహనాలు తస్కరిస్తున్న వ్యక్తి అరెస్టు



ఆటోలతో పట్టుబడిన నిందితుడు

నిజాంపేట్: వాహనాల దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఓ వ్యక్తిని బాచుపల్లి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లికి చెందిన పవార్ దశరథ్ (20), అబ్బాజీ అలియాస్ చింటూ స్నేహితులు. జల్సాలకు అలవాటు పడిన వీరిద్దరూ బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 3, మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, ఆర్సి పురం పీఎస్ పరిధిలో మొత్తం ఐదు ఆటోలతో పాటు బైక్‌లను దొంగిలించి తప్పించుకుని తిరుగుతున్నారు. వీరిపై నిఘా ఉంచిన బాచుపల్లి పోలీసులు శుక్రవారం ఉదయం 7గంటల ప్రాంతంలో బాచుపల్లికి వస్తుండగా పట్టుకున్నారు. విచారణలో మొత్తం ఐదు వాహన చోరీ చేసినట్లు అంగీకరించాడు. మరో నిందితుడు అబ్బాజీ పరారీలో ఉన్నాడు. అతడి వద్ద నుంచి రూ.6.20 లక్షలు విలువ చేసే రెండు ఆటోలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితులు ఒక ఆటోను విడగొట్టి విక్రయించినట్లు తెలుస్తోంది.

అప్పు ఇచ్చి ప్రాణం మీదికి తెచ్చుకుంది

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

జగద్గిరిగుట్ట: డబ్బులు అప్పు ఇచ్చి ప్రాణం మీదికి తెచ్చుకుంది ఓ మహిళ. ప్రకాశం జాల్లాకు చెందిన శ్రీనివాస్, అనూష (28) ఐదేళ్లుగా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమయ్యనగర్‌లో ఐదేళ్లుగా ఉంటున్నారు. శ్రీనివాస్ ఆర్ఎంపి డాక్టర్‌గా అనూష కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేటు హాస్పటల్‌లో నర్స్‌గా పనిచేస్తోంది. వీరికి సంవత్సరం క్రితం ఫ్యామిలీ ఫ్రెండ్ సతీష్ పరిచయ్యమయ్యాడు. ఆ తర్వాత సతీష్ తన అవసరం నిమిత్తం రూ.3.25 లక్షలను శ్రీనివాస్, అనూష దగ్గర అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగగా ఇస్తానంటూ తప్పించుకు తిరుగుతున్నాడు. కొన్ని రోజుల క్రితం సోమయ్యనగర్‌కు వచ్చిన సతీష్ బాత్‌రూంలో స్నానం చేస్తున్న అనూష ఫొటోలు తీసాడు. అప్పటి నుంచి డబ్బులు అడిగినప్పుడల్లా ఫొటోలు బయటపెడతానని బెదరించాడు. దీంలో విసిగిన అనూష శుక్రవారం సాయంత్రం 7గంటలకు ఇంట్లో ఫ్యాన్‌కి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదవశాత్తు కింద పడి కార్మికుడు మృతి

కుత్బుల్లాపూర్: రిటైనింగ్ వాల్ కాంక్రీట్ పనులు నిర్వహిస్తుండగా ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడటంతో మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన గణేశ్వర్‌రావు మహంతి (48) సంవత్సరం క్రితం దూలపల్లిలో నివాసముంటూ బీమ్స్ అండ్ కాలమ్స్ కన్‌స్ట్రక్షన్స్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈనెల 23న పరిశ్రమ ఆవరణలో రిటైనింగ్ వాల్‌కు కాంక్రీట్ పోసే క్రమంలో ఫ్లైయింగ్ బోర్డులు సరిగా అమర్చకపోవడంతో గణేశ్వరరావు కింద పడ్డాడు. అతని తలకు తీవ్రమైన గాయం కావడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అతని పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈనెల 24న చికిత్స పొందుతూ మృతి చెందాడు. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే తన అన్న మృతి చెందాడని మృతుడి సోదరుడు కాగేశ్వర్ మహంతి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కబ్జాదారులకు అధికారులు వత్తాసు పలకడమేంటి?

కైలాస్‌హిల్స్ కాలనీ అసోసియేషన్

సుభాష్‌నగర్: కాలనీలో యథేచ్ఛగా సర్వే నంబరు మార్చి భూ దోపిడీకి పాల్పడుతున్న వ్యక్తులకు అధికారులు వత్తాసు పలకడం హేయమైన చర్య అని కైలాస్‌హిల్స్ కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ యాదయ్య, మాజీ ప్రెసిడెంట్ అన్నారు. శుక్రవారం కైలాస్ హిల్స్ లో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సర్వే నంబర్ 299, 300, 301లోని స్థలం ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందన్నారు. గతంలో ఇక్కడ నిర్మాణాలు చేపడితే అధికారులు కూల్చేశారని తెలిపారు. ప్రస్తుతం అక్కడ నిర్మాణానికి ఇదే శాఖ అధికారులు ఎన్‌ఓసీ ఇవ్వడమేంటని ప్రశ్నించారు. పైగా ఎఫ్‌టీఎల్ స్థలాన్ని తప్పించడానికి పక్కనే ఉన్న 295 సర్వే నంబర్‌లోకి జరిగారని ఆరోపించారు. కొన్నేళ్లుగా సర్వేనం295లో 4,198 గజాల పార్కు స్థలం ఉండగా మరో వ్యక్తి 2098 సర్వే నంబర్‌గా పేర్కొంటున్నాడు. జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన బోర్డుపైనే ఏకంగా సర్వే నంబర్ సొంతంగా అతికించారని వాపోయారు. ఈ విషయమై ఉన్నతాధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. కబ్జాదారులను అడ్డుకోకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



ఓయూ సివిల్ సర్వీసెస్ అకాడమీలో శిక్షణ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థులకు మే 1వ తేదీ నుంచి సివిల్ సర్వీసెస్ అకాడమీలో శిక్షణ తరగతులు ప్రారంభంకానున్నాయి. టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1, 2, 3 ఉద్యోగాల రాత పరీక్షలకు సోమవారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7.30 గంటల వరకు విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

360 గ్రాముల గంజాయితో పట్టుబడ్డ ఇద్దరు

నిజాంపేట్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుండి బాచుపల్లి పోలీసులు 360 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ శ్రీనివాస్‌రావు వివరాలు వెల్లడించారు. బాచుపల్లిలోని శ్రీహోమ్స్‌లో నివాసముండే జయరామకృష్ణ (25), హుస్సేన్ బాషా (25)లు స్నేహితులు. వీరు యాపిల్ కంపెనీకి చెందిన నకిలీ ఇయర్ పాడ్‌లను విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌సాగర్ సిబ్బందితో కలిసి శ్రీహోమ్‌లో వారు నివాసముంటున్న ఇంట్లో తనిఖీలు చేపట్టారు. నకిలీ ఇయర్ పాడ్‌లు లభించాయి. అదే సమయంలో వారి గదిలో 360 గ్రాముల గంజాయి, హుక్కా పాట్ లభించింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా మహారాష్ట్రకు చెందిన ఆకాష్ తమకు గంజాయిని సరఫరా చేస్తున్నట్లు అంగీకరించారు. దీంతో జయరామకృష్ణ, హుస్సేన్ భాషాలపై కేసు నమోదు చేసి ఈనెల 27న రిమాండ్‌కు పంపినట్లు డీసీపీ తెలిపారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐ ప్రేమ్‌సాగర్‌ను డీసీపీ అభినందించారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, బాచుపల్లి సీఐ సుమన్ పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శ్రీనివాస్‌రావు

అనుచిత వ్యాఖ్యలు.. కేసు నమోదు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్‌పై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు పోలీసులు ఫిర్యాదు చేశారు. విషయమై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.